..నేపాల్‌లో ఘోరకలి కళ్లముందు ఇంకా కదలాడుతూనే వుంది.. శిథిల భవనాల కింద మృత్యుకేకలు వినిపిస్తూనే వున్నాయి.. ఒకవైపు శిథిలాల కింద నలిగి చనిపోయిన వారిసంఖ్య రోజు రోజుకే పెరుగుతుంటే, మరోవైపు భూ ప్రకంపనాలు ఇంకా కొనసాగుతూ ఇక్కడి ప్రజలనూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి..
నేపాల్‌లో కొనసాగుతున్న భూ ప్రకంపనలు మన ప్రాంతాలకు కూడా వచ్చే అవకాశాలు లేకపోలేదు. ఎక్కడ ఏ భూకంప ప్రకంపనలు వచ్చినా కోస్తా, విజయవాడ ప్రాంతంలోనూ ఎంతో కొంత ఆనవాళ్ళు కనబడటం కూడా పరిపాటిగా ఉంటుంది. ఈ నేపథ్యంలో భూకంపం వచ్చి భారీ నష్టం వాటిల్లకముందే మన నిర్మాణాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది..

# మన భవనాల్లో.. భద్రతెంత?

● భూకంప ప్రభావిత జోన్‌లో ఆంధ్ర

● మూడో జోన్‌లో కోస్తాంధ్ర.. హెచ్చరిస్తున్న నిపుణులు

● నవ్యాంధ్రలో నూతన నిర్మాణల్లో ప్రమాణాలు తప్పనిసరి

భారతదేశలో నాలుగు జోన్‌లు భూకంప ప్రభావిత జోన్‌లుగా ఉంటే వాటిలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యంగా కోస్తా ప్రాంతం మూడవ జోన్‌లో ఉంది. రెండవ జోన్‌లో ఉన్న హైదరాబాద్ కొంతవరకు పర్వాలేకున్నా, మూడవ జోన్‌లో ఉన్న కోస్తా ప్రాంతంలో ఎప్పటికైనా ముప్పు తప్పదనేది అనుభవజ్ఞుల భావన. ప్రధానంగా ఈ ప్రాంతంలో భూమి లూజు, తీర ప్రాంతాల్లో మరింత ఇసుక నేల కావడంతో ఈ ప్రకంపనలు వచ్చినపుడు మరింత ప్రభావానికి గురయ్యే పరిస్థితి వుంది.

(విజయవాడ సిటీ)

మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే బాడీ చెకప్ చేయించుకుంటాము.. అలాగే నేపాల్‌లో జరిగిన ఘోర సంఘటనను చూస్తే ఇప్పుడు మనం వుంటున్న నివాసాలను కూడా తప్పనిసరిగా చెకప్ చేయించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందనిపిస్తుంది. భవన నిర్మాణాల్లో కొన్ని ఇంజనీరు పర్యవేక్షణలో కట్టిన భవనాలుంటే మరికొన్ని తాపీమేస్త్రి సలహాలతో నిర్మించినవి. మరికొన్ని ఎవరో నిర్మించి ఇస్తే కొన్నవి ఉన్నాయి. వేరే వ్యక్తుల వద్ద కొన్న భవనాలలో ప్రమాణాలు పాటించారో లేదో తెలియదు. ఏదెలా వున్నా నేపాల్‌లోగాని, అంతకు ముందు గత కొన్నేళ్ళ క్రితం గుజరాత్ సంఘటనల్లో భారీనష్టం జరిగిన తర్వాత ఆలోచించడం జరుగుతుంది. వినాశనం జరగక ముందే మేల్కొని తగిన ముందస్తు చర్యలు తీసుకుంటే నష్టాన్ని కొంతైనా తగ్గించవచ్చు. నవ్యాంధ్ర నిర్మాణాల్లో ముందస్తు భద్రతా చర్యలు చేపట్టడం చాలా ఉత్తమం. పాత నిర్మాణాల్లో వాడిన ఇనుము తుప్పుపట్టే పరిస్థితి ఉంది. 20 ఎంఎంరాడ్ వాడినా తుప్పు పట్టడం వల్ల అది 16 ఎంఎం స్థాయికి వస్తుంది. అదీగాక ఈ ప్రాంతం తుప్పుపట్టే స్వభావం ఎక్కువ. అందువల్ల ఒకసారి తప్పనిసరిగా పాత నిర్మాణాలకు పరీక్షలు చేయించుకోవడం చాలా మంచిది. చదరపు అడుగుకు భవన నిర్మాణ పద్ధతిని బట్టి రూ.200లు నుంచి రూ.500 వరకు ఖర్చవుతుంది. రాజధాని ప్రాంతం అమరావతి పరిసర ప్రాంతాల్లో గాని, తీర ప్రాంతాల్లో గాని ఇప్పటివరకు జరిగిన నిర్మాణాలు ఒకటైతే, రాబోవు పదేళ్ళ కాలంలో జరగబోవు నిర్మాణాలు ఒకెత్తు. భారీస్థాయిలో నిర్మాణాలు జరుగనున్నాయి. ఇలాంటి సందర్భంలో ఈ నిర్మాణాలకు భూకంప భద్రతా చర్యలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా నిర్మాణం చేపట్టేటప్పుడు భూసార పరీక్షలు, టెక్చర్ డిజైనింగ్, కనస్ట్రక్షన్ ఇంజనీరింగ్‌ల సలహాలు, సూచనలు తప్పక పాటించాలి. ఒక రకంగా చెప్పాలంటే ఈ ముగ్గురు సర్టిఫై చేసిన తర్వాత నిర్మాణం చేపట్టడం ఉత్తమం.

దీనికి ఖర్చు పెరుగుతుందనే సందేహం ఉండవచ్చు. అయితే ఇకపై చేపట్టబోయే నిర్మాణాలు ఎక్కువగా దాదాపు వందేళ్ళ పైబడి ఉండేస్థాయిలో చేపడతారు కనుక తప్పనిసరిగా భూకంప ప్రభావాన్ని ఎదుర్కొనే విధంగా నిర్మాణాలు జరగాలి. ఆ తర్వాత భారీ నష్టం చవిచూసినా తర్వాత చేయగలిగేది ఏమీ ఉండదు. విజయవాడ మున్సిపాలిటీ, గుంటూరు మున్సిపాలిటీ, సీఆర్‌డీఏ పరిధిలో చాలా భవనాలు నూతనంగా నిర్మించనున్నారు. క్యాపిటల్ నిర్మాణాలు వందేళ్ళ వరకు ఉండేట్టు నిర్మించనున్నారు. నిర్మాణాలకు ఇంజనీరింగ్ సూచనలు, తప్పనిసరిగా భూ సార పరీక్షలు, స్ట్రక్చర్ డిజైనింగ్, ఇంజనీరింగ్ పర్యవేక్షణ ఉండాల్సిందే.


ఇటీవల భూకంపానికి నేపాల్‌లో నేలమట్టమైన భవనాలు


నవ్యాంధ్రలో నిర్మించబోయే భవనాల నమూనాలు

## ఇంజనీర్ బిల్లు అమలు చేయాలి

– సూర్యప్రకాష్, ఆలిండియా స్ట్రక్చర్, కన్సల్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు



భూకంపం వచ్చిన తర్వాత జరిగిన భారీ నష్టాన్ని చూసి బాధపడేకంటే ముందుగానే దాన్ని నివారించడానికి చర్యలు చేపట్టాలి. భూకంపం ఎప్పుడు వస్తుందనేది ఎవరూ చెప్పలేనిది. అయితే కొన్ని ప్రాంతాలు ఆజోన్ పరిధిల్లో ఉన్నాయని తెసినందున ఆ ప్రాంతాల్లో ముందుగానే తగు జాగ్రత్తలు పాటించాలి. దీనికి ప్రధానంగా ఏ నిర్మాణం చేపట్టినా భూసార పరీక్ష, డిజైనింగ్, పర్యవేక్షణ ఇంజనీర్ ముగ్గుర్ని బాధ్యులుగా చేస్తూ బిల్లులో పొందుపర్చాలి. వారు ధృవీకరణ చేసిన తర్వాత నిర్మాణం చేపట్టాలి. దానివల్ల తప్పనిసరిగా నిబంధనల ప్రకారం నిర్మాణం జరుగుతుంది. గుజరాత్‌లో భూకంపం తర్వాత మా ఇంజనీరింగ్ బృందం అక్కడకు వెళ్ళి పరిశీలించడం జరిగింది. కొన్ని పూర్తిగా ధ్వంసమయ్యాయి. కొన్ని కొంతమేర నష్టపోయాయి. సంఘటన జరిగిన తర్వాత చేపట్టే పద్దతులు కొన్నయితే అది జరగకముందే జాగ్రత్తలు పాటించడం చాలా ముఖ్యం. పాత భవనాలు తప్పనిసరిగా ఆరోగ్య పరీక్ష నిర్వహించి ఇంజనీరింగ్ సూచనలు అమలు చేయాలి. కొత్త నిర్మాణాలకు తప్పనిసరిగా నిబంధనలు అమలు చేయాలి. ఇవన్నీ జరగాలంటే ప్రభుత్వం ఇంజనీరింగ్ బిల్లు అమలు చేసి ఇంజనీర్‌ను బాధ్యులుగా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


భారీ భూకంపాలను సైతం తట్టుకునే భవనం


ప్రదర్శనలో ఏర్పాటు చేసిన బుద్ధుని ప్రతిమలు కళాఖండాలు..



# బుద్ధుని బోధనలు, ఆలోచనలు మార్గదర్శకాలు

● బుద్ధ జయంతి వేడుకల్లో కలెక్టర్ బాబు

**విజయవాడ సిటీ :** బుద్ధుని బోధనలు, ఆలోచనా విధానం ప్రపంచ మానవాళికి మార్గదర్శకత్వంగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ బాబు అన్నారు. మొగల్రాజపురంలోని మధు మహాలక్ష్మి కాంప్లెక్స్‌లో సోమవారం నిర్వహించిన బుద్ధ జయంతి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుద్ధుని సూక్తులు, సందేశాలు ప్రపంచంలో శాంతి నెలకొల్పడంలో ఎంతో ప్రముఖమైన పాత్రను పోషించాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతి పేరు పెట్టడంలో ప్రభుత్వం ఒక మంచి సందేశాన్ని నేటి యువతకు అందించిందని కలెక్టర్ బాబు తెలిపారు. ఈ ఫొటో ప్రదర్శనల ద్వారా నేటి యువతకు ఆయన పట్ల ఆసక్తి కనపరచడానికి ఎంతో ఉపయుక్తంగా వుంటుందని ఆయన నిర్వహకులను అభిన ందించారు. ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన ఫొటోలు సాంఘీక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ ఆర్.మల్లిఖార్జునరావు చిత్రించిన విధానాన్ని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలోని చరిత్రక కట్టడాలను పునర్ వైభవం తీసుకురావడం జరుగుతుందని కలెక్టర్ బాబు అన్నారు. దశాబ్దం క్రితం అమరావతిలో నిర్వహించిన బౌద్ధక్షేత్రం నమూనాకు ఈరోజు వాస్తవ రూపంలోకి రావండం ఎంతో ఆనందంగా ఉందని ఈ సందర్భంగా మల్లిఖార్జునరావు మాట్లాడుతూ అన్నారు. ఈ కార్యక్రమము ఏర్పాటు చేసినందుకు వై.హరిచంద్రప్రసాద్‌ను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇ.శివనాగిరెడ్డి, బౌద్ధగురువు బుద్ధిష్ట్ బంతే, ఇసిఓ సందీప్ పలువరు చిత్రకారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ ఫొటో ఎగ్జిబిషన్ ఈ నెల 8వ తేదీ వరకు కొనసాగుతుంది.


ఫొటో ప్రదర్శనను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న కలెక్టర్ బాబు